## క్లుప్తంగా

### పని ఒత్తిడి తగ్గించాలంటూ వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దెందులూరు: తమపై పని భారం, అధిక ఒత్తిడి తగ్గించాలంటూ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కె.శ్రీదేవికి గురువారం వినితిపత్రం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నిర్ణీత విధులకు మించి పనులు చేయడం వల్ల అధిక భారం, ఒత్తిడి ఎక్కువై అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఇంటర్ స్టడీ మెటీరియల్ పంపిణీ



నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఉంగుటూరు : నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులకు గురువారం రూ.25 వేలు విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల ఎకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ సీహెచ్‌వీవీ రామచంద్రరావు, అధ్యాపకులు కె.వైనాయుడు, కె.దుర్గయ్య, జి.శ్రీనివాసు, శ్రీకాంత్, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### శేషు సేవలు ఆదర్శప్రాయం



శేషు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

గణపవరం: మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా, మండల విద్యాశాఖ అధికారిగా పుచ్చల శేషు అందించిన సేవలు ఆదర్శప్రాయమని ఎంఈఓ-2 గొర్రెల బాలయ్య అన్నారు. గురువారం గణపవరం, నిడమర్రు మండలాల ఎంఈఓ-1గా పనిచేసి పదవీ విరమణ పొందిన పుచ్చల శేషును రెండు మండలాల ఎంఈఓ కార్యాలయాల సిబ్బంది, సీఆర్‌పీలు ఘనంగా సన్మానించారు. శేషు దంపతులను పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

### కొవ్వలిలో పడిపూజ



పడిపూజ చేస్తున్న స్వాములు

దెందులూరు: కొవ్వలిలోని గ్రీన్ పార్క్ హోటల్ ఆవరణలో నందిగం గోపి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. గురుస్వాములు గవ్వ జగన్నాథం, మనోహరం, గ్రామంలోని 100 మంది అయ్యప్పలు పాల్గొన్నారు. తొలుత కోఆపరేటివ్ బ్యాంక్ సొసైటీ మాజీ అధ్యక్షుడు కొమ్మిన రాముస్వామి అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజలు, భజనలు చేశారు.

### ఆలయాలకు స్వతంత్రత కల్పించాలి

ఉంగుటూరు: ఆలయాలకు స్వతంత్రత కల్పించాలని శృంగ వృక్షం సాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ అన్నారు. ఆలయాల రక్షణ కోసం జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావంను విజయవంతం చేయాలని కోరారు. అఖిల భారత ధార్మిక పరిషత్ సర్వోదయ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉంగుటూరులో గురువారం ప్రచారం సమావేశం నిర్వహించారు. శంఖారావం జిల్లా కార్యనిర్వాహకుడు సూర్యప్రకాశం, జోగిశాస్త్రి తదితరలు మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు స్వామీజిని సత్కరించారు. బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు, కండక్టర్ల మార్పు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. పోలసానిపల్లి, భీమడోలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

### వీఏపురంలో రెవెన్యూ సదస్సు

ఉంగుటూరు: వీఏపురంలో తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు అధ్యక్షతన గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్, వీఆర్వోలు, ఆర్ఐ పాల్గొన్నారు.

# అన్నదాతకు అందని సాయం

- వరస తుఫాన్లతో తగ్గిన ఖరీఫ్ దిగుబడి
- ధాన్యం సొమ్ము పెట్టుబడి, వడ్డీలకే సరి
- రబీ పెట్టుబడి కోసం ఎదురుచూపులు
- అమలుకాని ఏటా రూ.20 వేల హామీ
- గతంలో పంట పంటకూ అందిన సాయం



రబీకి చేలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమైన నిడమర్రు రైతులు



లోడ్ చేసేందుకు ధాన్యం బస్తాలను సిద్ధం చేస్తున్న బువ్వనపల్లి రైతులు

నిడమర్రు: ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభమైనా నేటికీ రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతులు పెట్టుబడి కోసం ముందుగానే వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసేవారు. అయితే సార్వత్రిక ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు పెట్టుబడి కేంద్ర ప్రభుత్వం సాయంతో కలిపి రైతు కుటుంబానికి రూ.20 వేలు అందిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక కేంద్రం వాటా రూ.4 వేలు అందినా, నేటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వాటా అందలేదని రైతులు వాపోతున్నారు. పైగా అదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని కూడా కూటమి సర్కారు తమపైనే మోపిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం**

వైఎస్సార్ సీపీ హయాంలో రైతుల తరపున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి, వారిని ఆదుకుంది. పంట సాగుచేసే ప్రతి రైతుకూ పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా క్రమం తప్పకుండా జమచేసేది. ఐదో విడత సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. కూటమి పార్టీలు అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయినా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. దీంతో రైతులు కూటమి సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు చిన్న, సన్నకారు రైతులు 25 వేల మందికిపైగా ఉన్నారు. ఈ ఏడాది 32 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. నిడమర్రు మండలంలో 12447 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రైతులు ప్రతి ఏటా జూన్, జులైలో వరి పంట సాగు చేస్తారు. పెట్టుబడి పెట్టే సమయంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఉంటే అప్పుల బాధ తప్పేది. ప్రస్తుతం చేతికందిన ఖరీఫ్ పంట పెట్టుబడి అప్పులకే సరిపోయిందని రైతులు చెబుతున్నారు. ఎన్నికల హామీ అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు.

**గత నాలుగేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా వివరాలు**

| మండలం | లబ్ధిదారులు | అందిన లబ్ధి రూ.కోట్లలో.. |
|---|---|---|
| ఉంగుటూరు | 10109 | 44.25 |
| భీమడోలు | 4681 | 23.51 |
| గణపవరం | 6529 | 27.48 |
| నిడమర్రు | 4200 | 17.83 |
| మొత్తం | 25,519 | 113.07 |

**నాలుగేళ్లలో రూ.54 వేల చొప్పున జమ**

వైఎస్సార్ సీపీ హయాంలో రైతుకు ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.7500, కేంద్ర నుంచి రూ.6 వేలు కలిపి రూ.13,500 చొప్పున రైతు బ్యాంక్ ఖాతాలో పంట వేసుకునే సమయంలో జమయ్యేది. వరుసగా నాలుగేళ్లపాటు మొత్తం రూ.54,000 రైతుల ఖాతాల్లో జమైంది. ఎన్నికల కోడ్ కారణంగా ఐదో విడత రైతు భరోసా నగదు నాటి ప్రభుత్వం జమ చేయలేకపోయింది. అనంతరం అధికారంలో కొచ్చిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.80 వేలు రైతులకు అందిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ అమలు చేయకపోవడంతో నియోజకవర్గం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల పక్షాన పోరాటం**



హామీలు అమలు చేసే వరకూ రైతుల పక్షాన పోరాడతాం. ఇందులో భాగంగానే శుక్రవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాతలు చేసే ఆందోళన విజవంతానికి కృషి చేస్తాం. తమ హయాంలో నాలుగు విడతల్లో వైఎస్సార్ రైతు భరోసా కింద ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.113 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశాం.

– పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు

### నేడు వైఎస్సార్ సీపీ ర్యాలీ



అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతుల సమస్యలపై కలెక్టర్ కె.వెట్రిసెల్వికి వినతిపత్రం ఇవ్వనున్నట్టు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని రైతులు, పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

### నేడు చేబ్రోలు నుంచి ర్యాలీ

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతు సమస్యలపై చేబ్రోలు నుంచి ఏలూరు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎంపీటీసీల ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శుక్రవారం ఉదయం 9 గంటలకు చేబ్రోలు చేరుకుంటారని, మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అక్కడికి రావాలని కోరారు.

**కలెక్టరేట్‌కు తరలిరండి**

భీమడోలు: ఏలూరులోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు రైతు సమస్యలపై చేపట్టిన ర్యాలీ, ప్రదర్శన కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు తరలి రావాలని ఆ పార్టీ భీమడోలు మండల కన్వీనర్ రావిపాటి సత్య శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావులు కోరారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పిలుపు మేరకు ఏలూరులోని ఫైర్ స్టేషన్ వద్దకు తరలి రావాలన్నారు.

# క్రిస్మస్ కాంతులు



దెందులూరు ఆర్‌సీఎం చర్చి



దెందలూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి



కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ చర్చి

దెందులూరు: క్రిస్మస్ పండుగకు దెందులూరు మండలంలో అన్ని ప్రార్థన మందిరాలు ముస్తాబవుతున్నాయి. చర్చిల వద్ద విద్యుత్ బల్బులతో కూడిన 15 నుంచి 16 అడుగుల స్టార్లను ఏర్పాటు చేశారు. మసీదుపాడులో గ్రేస్ బాప్టిస్ట్, కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ, దెందులూరు ఆర్‌సీఎం, సాల్వేషన్ ఆర్మీ చర్చిల వద్ద భారీ క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేశారు. ఇవి రాత్రి సమయాల్లో విద్యుత్ కాంతులతో ఆకర్షిస్తున్నాయి.



మసీదుపాడు బాప్టిస్ట్ చర్చి వద్ద

# శ్రీశైలం బయలుదేరిన శివ స్వాములు

భీమడోలు: భీమడోలు గురువారం శివ నామస్మరణతో మార్మోగింది. గోదావరి కాల్వ గట్టుపై గల శివపీఠం శివ స్వాములు దీక్ష ముగించుకుని ఇరుముడులు ధరించి శ్రీశైలం పయనమయ్యారు. స్థానిక పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు కాళ్లకూరి ఉమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడులు ధరించారు. శాస్త్రోక్తంగా పూజలు చేశారు. స్వాముల కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మాలధారులు గ్రామంలోని ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శ్రీశైలం తరలివెళ్లారు.



ఇరుముడుల ధరించి శ్రీశైలం వెళ్తున్న మాలధారులు

# వేగంగా వంతెన నిర్మాణ పనులు

భీమడోలు: గుండుగొలను వంతెన నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. కాల్వపై వంతెన నిర్మాణానికి ఇప్పటికే రెండు వైపులా భారీ పిల్లర్లు ఏర్పాటు చేశారు. పిల్లర్లపై గడ్డర్లను బిగించేందుకు కాల్వలో భారీ క్రేన్లు తిరగాల్సి ఉండడంతో, సాగునీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా కాల్వలో తాత్కాలికంగా ఐరన్ పైపుల అమర్చి రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ప్రధాన ఘట్టంగా ఉన్న గడ్డర్లు అమర్చే పనులు చేపట్టనున్నారు. వాటిని అమర్చిన తర్వాత వంతెన మిగిలిన కాంక్రీటు పనులు చేపడతారు. ఆ పనులు పూర్తి కాగానే పైపులైన్లు, రోడ్డును తొలగిస్తారు.



కాల్వ వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్డు

# బిషప్ జాన్ ములగడకు నివాళి

పెదవేగి : ఏలూరు కథోలిక పీఠంలో బిషప్ జాన్ ములగడ చేసిన సేవలు చిరస్మరణీయమని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. గురువారం పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో దివంగత బిషప్ జాన్ మొలగడ 87వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి.మోజెస్ అధ్యక్షతన బిషప్ జాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫిలిప్స్, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.జాకబ్, డెంటల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, సిబ్బంది విద్యార్థులు నివాళులర్పించారు.



బిషప్ జాన్ ములగడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫాదర్లు

# మూడు రోజుల ధ్యాన శిక్షణ ప్రారంభం

పెదపాడు : వట్లూరు గురుకుల పాఠశాలలో శ్రీరామచంద్ర మిషన్ వారిచే హార్ట్‌ఫుల్‌నెస్ అనే ధ్యాన పద్ధతిపై మూడు రోజుల శిక్షణ గురువారం ప్రారంభించారు. రిలాక్సేషన్, ధ్యానం నిర్మలీకరణ ప్రార్థన అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు నిర్వాహకులు జోనల్ కో ఆర్డినేటర్ ఆర్‌వీ అప్పారావు తెలిపారు. మానవాళికి ఒత్తిడి లేని జీవితం, ప్రేమ, శాంతి, స్పష్టత కోసం ధ్యానం అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ విజయసారధి, ఏలూరు కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ట్రైనర్స్ దాసరి మేరీరుక్మిణీ రాణి, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

భీమడోలు: గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి, వాటి అమలు ద్వారా సంపద సృష్టించాలని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి కోర్సు అసిస్టెంట్ డైరెక్టర్, ఈవోఆర్‌డీ ఎ.సుందరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎంపీడీఓ పద్మావతిదేవి మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రజల నుంచి వచ్చే ఇంటి, కుళాయి తదితర పన్నులను సక్రమంగా వసూలు చేసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసుకుంటే తద్వారా సుస్థిరాభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, పీఆర్ ఏఈ సూర్యచంద్రరావు, ఎంపీహెచ్ఈఓ కిషోర్, ఏపీఎం రత్నకుమారిలు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గుండుగొలను, ఆగడాలలంక, చెట్టున్నపాడు, లక్ష్మీపురం, కోరుకల్లు, సూరప్పగూడెం, అంబరపేట, కుర్రెళ్లగూడెం సచివాలయాల్లోని గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సుస్థిరాభివృద్ధిపై మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, చిత్రంలో ఎంపీడీఓ పద్మావతీదేవి

**సుస్థిరాభివృద్ధి సాధనకు కృషి**

ఉంగుటూరు: సుస్థిరాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. గురువారం ఉంగుటూరులో సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారుల శిక్షణలో ఆమె మాట్లాడారు. సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఎంపీడీఓ గంజి రాజ్‌మనోజ్ మాట్లాడుతూ నూరు శాతం అభివృద్ధి సాధించిన పంచాయతీకి ప్రభుత్వం రూ.కోటి బహుమతి పంచాయతీ అందజేస్తుందన్నారు. రిసోర్సు పర్సన్స్‌గా ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, చేబ్రోలు ఈఓ ట్రైనర్ జి.శ్రీనివాసరావులు శిక్షణ ఇచ్చారు.

**పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ**

దెందులూరు: ఎల్ఎస్‌డీజీఎస్‌పై ఎంపీడీఓ కె.శ్రీదేవి అధ్యక్షతన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ హెల్తీ విజన్, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, సురక్షిత మంచినీరు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**గ్రామ పరిపాలనపై శిక్షణ**

పెదవేగి : గ్రామ పాలనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి 9 రకాల ప్రణాళికల రూప కల్పన చేశారు. సచివాలయ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

భీమడోలు: రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని భీమడోలు మండల ప్రత్యేకాధికారిణి ఆర్‌వీ నాగరాణి అన్నారు. గుండుగొలను పంచాయతీ వద్ద గురువారం రెవెన్యూ సదస్సు తహసీల్దార్ బి.రమాదేవి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన నాగరాణి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని సత్వరమే పౌర సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు. రెవెన్యూ శాఖకు చెందిన 49 రకాల పౌర సేవలను అర్హత ప్రామాణికంగా అందిస్తున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకుంటే గడువు తేదీలోగా పరిష్కరిస్తామని వివరించారు. తొలుత ప్రజలు అధికారులకు వినతిపత్రాలను అందించారు. అనంతరం 42 మందికి పట్టాదారు పాసు పుస్తకాలు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వో సింహాచలం, మురళీరాజు, కృష్ణకుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గుండుగొలనులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ప్రత్యేకాధికారి నాగరాణి

**నేటి నుంచి రెవెన్యూ సదస్సులు**

గణపవరం: మండలంలో శుక్రవారం నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ వైకేవీ అప్పారావు తెలిపారు. 13న వెంకట్రాజపురం, 16న కోమర్రు, డి.కుముదవల్లి, 17న కేశవరం, మొయ్యేరు, 18న పిప్పర, ముప్పర్తిపాడు, 19న కొత్తపల్లి, వరదరాజపురం, 20న అర్ధవరం, చిలకంపాడు, 21న గణపవరం, సీఆర్‌పురం, జగన్నాథపురం, 23న జల్లికాకినాడ, సరిపల్లె, 27న కొమ్మర, వెలగపల్లి, 28న వల్లూరు, వీరేశ్వరపురం, వాకపల్లి, 30న కాశిపాడు, కొందేపాడు, 31న ఎ.గోపవరం, ముగ్గళ్ల గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**దెందులూరు మండలంలో..**

దెందులూరు: మండలంలో ఈ నెల 13 నుంచి వచ్చేనెల 8వతేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. 13న ఉప్పుగూడెం, చల్లపల్లి, 16న కొవ్వలి, 17న దోసపాడు, 19న పోతునూరు, 20న దెందులూరు, 21న చల్లచింతలపూడి, 23న ముప్పవరం నరసింహపురం, 24న రామన్నగూడెం, మలకచర్ల, 27న కొత్తగూడెం, సింగవరం, కొమరేపల్లి, 28న గాలాయగూడెం, 30న అక్కిరెడ్డిగూడెం, నాగుల దేవునిపాడు, జనవరి 3న తిమ్మన్నగూడెం, 4న మేధినరావుపాలెం, గుడిగుంట, 6న శ్రీరామవరం, 8న సింగగూడెంలలో సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

### 14న సాగునీటి సంఘాల ఎన్నికలు

ఉంగుటూరు: మండలంలోని ఏడు మేజరు సాగునీటి సంఘాలకు, 8 మైనర్ ఇరిగేషన్ సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. పోటీచేసే రైతులు వీఆర్వోకు నామినేషన్ తోపాటుగా నో డ్యూస్ సర్టిఫికెట్టుతో పన్ను రసీదును అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

పెదవేగి : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలవర పరిసింది. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం వంగూరు గ్రామానికి చెందిన సువ్వా కళ్యాణ్ (27) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కొక్కానికి చీరతో ఉరి వేసుకున్నాడు. అతని తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

### ఫుట్‌బాల్ రిటైర్డ్ కోచ్ సుబ్బారావు మృతి

ఏలూరు రూరల్ : శాప్ రిటైర్డ్ ఫుట్‌బాల్ కోచ్ కాశీ సుబ్బారావు అనారోగ్యంతో గురువారం ఉదయం ఏలూరులో మృతి చెందారు. ఆయన 30 ఏళ్లపాటు ఫుట్‌బాల్ కోచ్‌గా సేవలందించారు. మధ్యాహ్నం ఏలూరులో అంత్యక్రియ లు నిర్వహించారు. సుబ్బారావు మృదేహంపై ఆయన అల్లుడు, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, మాజీ ఎంపీ మాగంటి బాబు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు, ఫుట్‌బాల్ కోచ్ సిరాజద్దీన్‌తో పాటు ఏలూరులో ఫుట్‌బాల్ క్రీడాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావు సేవలను కొనియాడారు.